క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

శింగనమల: నాగులగుడ్డం తండాలో ఆదివారం ఉదయం 8 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఆలయాభివృద్ధికి విరాళం

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని అంబా భవాని ఆలయానికి శనివారం పట్టణానికి చెందిన బలరామిరెడ్డి రూ.10 వేలు విరాళం అందించారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వెచ్చిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆనందరావు తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి

యల్లనూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పంటనష్ట పరిహారం, రైతు భరోసా వంటివి రైతులకు అందాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు అవగాహన కల్పించి రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. మీసేవా కేంద్రాలు, గ్రామ సచివాలయం, సెల్‌ఫోన్‌లో కూడా ఈ కేవైసీ చేసుకోవచ్చని తెలిపారు.

డ్రోన్ ఫ్లైటెస్టింగ్



గుత్తిలో డ్రోన్ ఫ్లైటెస్టింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం మున్సిపల్ అధికారులు, ఏరో డ్రోన్ కంపెనీ ఆధ్వర్యంలో డ్రోన్ ఫ్లై టెస్టింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఏరో డ్రోన్ కంపెనీ, మున్సిపల్ అధికారులు ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం సర్వే ప్రారంభించారు. భూ సర్వే పకడ్బందీగా చేపట్టడానికి డ్రోన్ ఫ్లై టెస్టింగ్ ఉపయోగపడుతుందని మున్సిపల్ అధికారులు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి శ్రీకారం

గుంతకల్లు రూరల్: టీపీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కసాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శనివారం టీపీఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత పరశురాముడు ఆధ్వర్యంలో వేదపండితుల ఆధ్వర్యంలో నిత్యాన్నదాన ఆశ్రమం ఏర్పాటుకు పూజలు నిర్వహించారు. అనంతర భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఉపాధి పనులు కల్పించాలి

పామిడి: మండల కేంద్రంలోని కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ వినతిపత్రం అందజేశారు. సీపీఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి మాట్లాడుతూ అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, మల్లేసు, శంకర్, బాబాఫకృద్దీన్, వెంకటన్న, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో వెలసిన వేంకటరమణస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం కుంభాభిషేకం నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాల్లో జప పారాయణం, గణపతి, రుద్ర, నవగ్రహ, లక్ష్మీనారాయణ, శాంతి హోమం, పూర్ణాహుతి, 11 గంటలకు మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం, నిర్వహించారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి పాల్గొని పూజలు చేయించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

తాగునీటి ట్యాంకుల ప్రారంభం



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఆలూరు విరాట్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కుమారుడు ఆలూరి విరాట్ మూడు వాటర్ ట్యాంక్‌లు ప్రారంభించారు. కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాలనీలో ఎమ్మెల్యే 3 వాటర్ ట్యాంక్‌లు మంజూరు చేశారు. సర్పంచ్ పార్వతి, ఎమ్మెల్యే అమ్మ నిర్మలాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు పూల నారాయణ స్వామి, బుల్లే నారాయణస్వామి, వార్డు మెంబర్లు ప్రసాద్, కుళ్లాయప్ప, పూల రంగనాథ్, పూల రవి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమయాత్రకు అపూర్వ స్వాగతం

- ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపించిన జనం
- ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ముప్పాలగుత్తిలో జనం మధ్య సాగుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి యాత్ర

పెద్దవడుగూరు: తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్రకు గ్రామ గ్రామాన అపూర్వ స్వాగతం లభించింది. గ్రామ శివార్లలోనే మహిళలు పూలవర్షం కురిపిస్తూ హారతులతో ఘన స్వాగతం పలుకుతున్నారు. ఎమ్మెల్యే అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారానికి భరోసానిస్తూ ముందుకు సాగారు. మూడో రోజు శనివారం ఉదయం 9.30 గంటలకు లక్ష్మంపల్లి నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దమ్మ, సుంకులమ్మ , శివాలయం, సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముప్పాలగుత్తికి బయలుదేరారు. గ్రామానికి చేరుకోగానే మహిళలు ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి పూలతో స్వాగతం పలికారు. అవ్వా.. బాగున్నారా, పెద్దాయనా.. బాగున్నారా అంటూ ఆప్యాయంగా పలకరించారు. కొందరు వృద్ధులు, మహిళలు ఎమ్మెల్యేతో కలిసి అడుగులు వేస్తూ సంఘీబావం తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రెండో పంటకు సాగునీరు అందించానాని, గతంలో జనవరి నెలాఖరి వరకూ సాగునీరు అందించాలని మండల నాయకులు ఎవరైనా జేసీ సోదరుల వద్దకు వెళితే అవమానించి పంపించే వారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం కావాలని కోరగా తగిన సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తానన్నారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచం రామ్మోహన్, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, నాయకులు రంగస్వామి, రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ గూడూరు పెద్ద ఓబుళరెడ్డి, చిన్న ఓబుళరెడ్డి, వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి, యాడికి మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, నగరూరు బ్రహ్మారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, సజ్జల దిన్నె రాజు, బీసీ విభాగం నాయకులు వెంకటస్వామిగౌడ్, శేషారెడ్డి, మధు, నాగరాజు, నాగభూషణ, మల్లేశ్వరరెడ్డి, లక్ష్మంపల్లి ఎంపీటీసీ కమలాక్షి, సర్పంచ్ అనంతమ్మ, బ్రహ్మానందరెడ్డి, హరికృష్ణారెడ్డి, సత్యంరెడ్డి, ముప్పాలగుత్తి ఆది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే పథకాల వర్తింపు



తనకు కల్గిన లబ్ధిని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి తెలియజేస్తున్న మారుతేశ్వరమ్మ

శింగనమల: ముఖ్యమంత్రిగా జగనన్న అయిన తరువాతనే తమకు సంక్షేమ పథకాలు వచ్చాయని, గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాలేదని మారుతేశ్వరి అనే మహిళ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతితో అన్నారు. శనివారం గురుగుంట్ల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా , లేదాసని అడిగి తెలుసుకున్నారు. మారుతేశ్వరి మహిళ మాట్లాడుతూ తమకు సంక్షేమ పథకాలు వచ్చాయని, వాటితో తమ కుటుంబం సంతోషంగా ఉందన్నారు. జగనన్నకు తాము రుణపడి ఉంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ, పాతవూరులో ప్రతి గడప వద్దకే వెళ్లి వారు పొందిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలను ఎటువంటి సిఫారసు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని అధికారులకు సూచించామన్నారు. పేదలందరూ బాగుండాలన్నదే జగనన్న ధ్యేయమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ అంజన్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్, జగన్, భాస్కర్‌రెడ్డి, పుల్లప్ప, దైవయత్నం, రామాంజినేయులు, శకుంతలమ్మ, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

జనరంజకంగా జగనన్న పాలన



అంబేద్కర్ నగర్‌లో అవ్వను పలకరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన జనరంజకంగా సాగుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 16వ వార్డు పరిధి అంబేడ్కర్ నగర్ (యల్లనూరు రోడ్డు చౌడమ్మ గుడి)లో శనివారం సాయంత్రం జన చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, మహిళా కార్యదర్శి నాగూరు షరీఫా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జాన్సన్‌తో కలసి హర్ష ఇంటింటికి వెళ్లి ప్రజలందరినీ ఆప్యాయంగా పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత వార్డు సెక్రటరీలను సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆకుల చిన్ననాగిరెడ్డి, రాఘవేంద్ర, మాజీ కౌన్సిలర్ బాబు, రంగనాథరెడ్డి, నాయకులు వాసుదేవరెడ్డి, బాలిరెడ్డి, సుధీర్‌రెడ్డి, జావీద్, వేలూరు శ్రీనివాసులు, బాబా, జావీద్, ఫైరా, షబ్బీర్, సూర్యనారాయణరెడ్డి, రంగనాయకులు, హరినాథరెడ్డి, గణేష్, రామకృష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



సూర్యయంత్ర ఆరాధన పూజలను నిర్వహిస్తున్న దృశ్యం



ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న అర్చకులు



నార్పల : గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడవాహనంపై కొలువుదీరిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను ఆలయ ముఖమండప ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో రథసప్తమి పూజలను నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి యంత్రాన్ని ఏర్పాటు చేసి ఆరాధనలు నిర్వహించారు. అక్కడే చక్కెర పొంగలిని సిద్ధం చేసి స్వామికి నివేదించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు, ఇతర సిబ్బంది అందరూ కలిసి సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. అనంతరం గరుడ వాహనంపై కొలువదీరిన స్వామికి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు.

వేంకటేశ్వరాలయంలో..

గుంతకల్లు: స్థానిక వేంటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రథసాప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని నైరుతి దిక్కున ఉన్న గుహలోని సూర్యానారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వేంకటేశ్వర స్వామి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలను సూర్య ప్రభ పల్లకీపై కొలువుదీర్చి ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.భాస్కర్ రంగయ్య, కార్యదర్శి నారాయణ, కోశాధికారి సుధాకర్, నాయకులు వెంకట్, రమేష్‌రెడ్డి, సుదర్శన్‌బాబు, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక శివాలయం వీధిలోని అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు శనివారం సామూహిక ఆదిత్య హృదయ పారాయణం చేశారు. మాఘమాసం కృష్ణ పక్ష రథసప్తమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

పామిడి: స్థానిక తగ్గు దేవాలయంలో శనివారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి పట్టణ వీధులల్లో ఊరేగించారు. కండ్లపల్లి గ్రామ అభయాంజనేయస్వామి భజన మండలి బృందం భక్తిగీతాలాపనలు చేశారు. స్థానిక సరస్వతీ ఉన్నత విద్యామందిరం, నిట్టూరు నిలయంలో విద్యార్థులు సూర్య నమస్కారాలు ఆచరించారు.

నార్పలలో వైభవంగా రథసప్తమి

నార్పల: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. అర్చకులు రఘునాథ్‌శర్మ స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు.సాయంత్రం స్వామి గ్రామోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ నేత మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. మాజీ సర్పంచులు నార్పల సంజీవరెడ్డి, నార్పల స్వాతిలతరెడ్డి, నార్పల శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, సుబ్బయ్య, రంగయ్య పాల్గొన్నారు.

వైభవంగా తిమ్మప్పస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: బసినేపల్లి గ్రామ శివారులోని గద్దెరాళ్ల కొండపై వెలసిన తిమ్మప్ప స్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో వేకువ జామున శ్రీదేవి, భూదేవి సమేత తిమ్మప్ప స్వామికి దివ్య కల్యాణం జరిపించారు. అనంతరం స్వామికి విశేష అభిషేకాలు, లక్ష్మీనారాయణ హోమం, పల్లకీ సేవ, వసంతోత్సవం, దీపాలంకరణ సేవ, నామ సంకీర్తన, ఊయల సేవ, పవలింపు సేవలను నిర్వహించారు. కరణాల, బొమ్మిడి వంశస్తుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల జీవితాలకు భరోసా



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: సీఎంఆర్‌ఎఫ్ పేదల జీవితాలకు భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్యం పట్ల జగనన్న నిరంతరం తపిస్తారన్నారు. ఇందుకు నిదర్శనమే కేవలం 9 మందికి రూ.30.90 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ కింద సాయం అందించడమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్ల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి పేదల ఆరోగ్యం కోసం జగనన్న మంజూరు చేస్తున్నారని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి తెలిపారు. చాలా గ్రామాల్లో ఆరోగ్య సేవ కేంద్రాలు ఏర్పా టు చేశారని, 24 గంటలు వైద్యశాలలు అందుబాటులో ఉంటున్నాయన్నారు. లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. పుట్లూరు ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు నాగార్జునరెడ్డి, రఘునాథరెడ్డి ఉన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం



స్పోర్ట్స్ మీట్‌లో మాట్లాడుతున్న నైరుతిరెడ్డి

గుంతకల్లు: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైల్వే క్రీడా మైదానంలో శనివారం భాష్యం హైస్కూల్ ఆధ్వర్యంలో జోనల్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, భాష్యం స్కూళ్ల జోనల్ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఖోఖో రాష్ట్ర కార్యదర్శి పుల్లయ్య, డివిజనల్ ఇంచార్జ్ రవిశర్మ, ప్రిన్సిపాల్ భార్గవి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆటలు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని పారద్రోలి నూతనోత్తేజాన్ని నింపుతాయన్నారు. విద్యతోపాటు ఆటల పోటీలను పాఠశాలలు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం జోనల్ పరిధిలోని భాష్యం పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు దేవా, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న సింగర్స్

గుత్తి: గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీ ఫౌండర్ వీకే సుధీర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానంలో శుక్రవారం రాత్రి 9.30 గంటల నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహించిన సంగీత విభావరి అందరినీ అలరించింది. అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన సింగర్లు పాటలు పాడారు. ఆర్ఆర్ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. గేయాలపనల్లో విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు. గుత్తి ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణగోపాల్‌రెడ్డి , ఎక్స్ ఆర్మీ కృష్ణయ్య, గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ అరవింద్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష

యాడికి: 8వ తరగతి విద్యార్థులు నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్ షిప్ పొందేందుకు మోడల్ పరీక్షను శనివారం నిర్వహించినట్లు యాడికి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయమ్మ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న జరగనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఉన్నత పాఠశాలలోని 18 మంది విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంఎంఎస్ కోఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రవికుమార్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి

బుక్కరాయసముద్రం: బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ నారాయణ స్వామి పేర్కొన్నారు. శనివారం కేజీబీవీని పరిశీలించారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు, ఎంత మంది సిబ్బంది, పని చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏఏ పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్యాధికారిణి స్వాతి లక్ష్మి, సీహెచ్ఓ మోహన్‌రావు, కేజీబీవీ పాఠశాల స్పెషలాఫీసర్ నాగవేణి, హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ ఉన్నారు.

2 నుంచి జకినీమాత జాతర



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో వెలిసిన ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీ మాత జాతర ఫిబ్రవరి 2 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆరె కటిక సంఘం, జకినీ మాత ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక జకినీ మాత ఆలయంలో జాతరకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆరె కటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణరావు, ఆలయ ధర్మకర్త సురేష్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు బాబు రావు, కోశాధికారి రామచంద్రారావు, సుధాకర్‌రావు, గౌరవ సలహాదారు రవి బాబు, యూత్ నాయకులు భాగ్యరాజ్, శ్రీనివాసులు, లక్ష్మీకాంత్, ఆలయ మేనేజర్ పంకజ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి: తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీనివాసపురానికి చెందిన ఖమ్మం ప్రవీణ్ (24) తన మొబైల్ ఫోన్‌ను తాకట్టు పెట్టి డబ్బు తీసుకుని తన అవసరాలు తీర్చుకున్నాడు. విషయం తెలియడంతో తల్లిదండ్రులు చంద్ర, నాగలక్ష్మి మందలించారు. మనస్తాపం చెందిన ప్రవీణ్.. శనివారం సాయంత్రం ఆటో నగర్ సమీపంలో రైలు కిందకు దూకాడు. రెండు కాళ్లు పూర్తిగా తెగి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండడంతో స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై జీఆర్పీ ఎస్ఐ నాగప్ప దర్యాప్తు చేపట్టారు.

పల్లెల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: పల్లెల్లో ఎవరైనా గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. శనివారం యల్లనూరు, పెద్దమల్లేపల్లి, నిట్టూరు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే గొడవలు చేసుకోకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు.

రైతులకు బిల్లులు ఇవ్వాల్సిందే



రాయలచెరువులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ మహబూబ్‌బాషా

యాడికి: ఎరువుల దుకాణంలో పురుగు మందులు, రసాయన ఎరువులు కొనే రైతులకు దుకాణదారులు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాయలచెరువులో ఉన్న గ్రోమోర్, సంకల్ప ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల ధరలు బోర్డు అందరికీ కనిపించేటట్లు ఉంచాలన్నారు.

పప్పుశనగలో పంటకోత ప్రయోగాలు

శింగనమల: ఆకులేడు గ్రామంలో శనివారం పప్పుశనగలో పంట కోత ప్రయోగాలు నిర్వహించినట్లు ఏఓ చిన్నమ్మ తెలిపారు. ఐదు మీటర్ల విస్తీర్ణంలో 1.370 కేజీలు దిగుబడి వచ్చింది. అనంతరం పత్తి పంటను పరిశీలించారు. ఆ తర్వాత లోలూరు క్రాస్‌లోని భాస్కర్ ఎరువుల తయారీ కర్మాగారాన్ని తనిఖీ చేశారు. అక్కడ రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది అఖిల, వీఆర్ఏ నల్లప్ప, రైతులు పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం

పామిడి: నీలూరులో జలజీవన్ మిషన్ పనులను సర్పంచ్ బీ ప్రమీలమ్మ శనివారం ప్రారంభించారు. గ్రామంలోని 222 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇస్తామని సర్పంచ్ తెలిపారు. ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ జయన్న, నాయకులు ధర్మేంధర్‌రెడ్డి, నారాయణస్వామి, పంచాయతీ సెక్రటరీ సంధ్యారాణి పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించండి

పెద్దపప్పూరు: సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. శనివారం చెర్లోపల్లె గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అన్న విషయంపై వలంటీర్లతో తెలుసుకోవాలన్నారు.

నిత్యావసరాల పంపిణీ

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన మేకల నాగరాజు కుటుంబానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తల్లి జొన్నలగడ్డ నిర్మలాదేవి శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నిర్మలాదేవి, ఎమ్మెల్యే కుమారుడు విరాట్‌తో కలసి నాగరాజు కుటుంబాన్ని పరామర్శించారు.